



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 18 పేజీలు : 4+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి ఆదివారం 22 సెప్టెంబర్ 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# ఆపరేషన్ మూసీ.. ప్రక్షాళనకు తొలి అడుగు

- నదిలోనే 12 వేలకు పైగా నిర్మాణాలు
- పలుచోట్ల ఏకంగా వెలసిన కాలనీలు
- నిర్వాసితులతో మంత్రి పొన్నం భేటీ
- పిల్లిగుడిసె,వనస్థలిపురంలో పర్యటన
- డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని ప్రతిపాదన



**హైదరాబాద్ పెన్ పవర్:** మూసీ ప్రక్షాళనకు తొలి అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ నది అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సన్నాహాలు చేస్తోంది. ఈ తొలగింపులో సర్వం కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి గతంలోనే ప్రకటించారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టు పనులు ప్రారంభమవాలంటే ముందుగా అక్రమణలన్నీ తొలగించాల్సి ఉంటుంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని షెడ్లు, గోదాంల కూల్చివేతనూ చేపట్టనున్నారు. మూడు నెలలుగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల రెవెన్యూ, సర్వే, ఎంఆర్‌డీసీఎల్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నుంచి తూర్పున కొర్రేముల వద్ద ఉన్న ఔటర్ వరకు సర్వేను పూర్తి చేశారు. నార్సింగ్ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు దాదాపు 25 కిలోమీటర్ల మేర ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 12 వేలకు పైగా అక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో హైదరాబాద్ జిల్లాలోని ఆసిఫ్‌నగర్, అంబర్‌పేట, బహదూర్‌పురా, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్‌ల పరిధిలో పెద్దఎత్తున అక్రమణలు జరిగినట్టు తేల్చారు. బహదూర్‌పురా, సైదాబాద్, అంబర్‌పేట మండలాల పరిధిలో అధికంగా నిర్మాణాలు ఉన్నాయి. చాలావరకు మూసీ నదిలోనే కాలనీలు సైతం ఏర్పడ్డాయి. 30, 40, 60 గజాల్లోనే ఇండ్లు కట్టుకున్నారు. మధ్యలో 10 అడుగుల దారి కూడా లేకుండా నిర్మించుకున్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేట, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండల పరిధి రామంతాపూర్, భగాయత్ తదితర ప్రాంతాల్లో ఏకంగా కాలనీలే ఉన్నాయి. కొందరు గోదాములు, షెడ్‌లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే వీటిని తొలగించే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

**నిర్వాసితులకు డబుల్ బెడ్రూం**

మూసీ ప్రక్షాళన నేపథ్యంలో ఆక్రమణలను తొలగించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ అథారిటీ

వివరాలు 2లో..



## తనిఖీల వివరాలు ప్రతి నెల నాకు రిపోర్ట్ చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రైవేటు, కార్పోరేట్ హాస్పిటల్లలో టాస్క్ ఫోర్స్ కమిటీలు నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు మంత్రి దామోదర రాజనర్సింహ. తనిఖీల వివరాలను ప్రతి నెల తనకు రిపోర్ట్ చేయాలని సూచించారు. సెక్రటేరియెట్ లో వైద్యశాఖ అధికారులతో సమావేశమయ్యారు మంత్రి. ఫుడ్ సెక్యూరిటీ అధికారులు హాస్పిటల్లలో డైట్ క్యాంటీన్లను తనిఖీలు చేయాలని చెప్పారు. ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల %నూణ%లు జిల్లాల్లోని హాస్పిటల్స్ ను విజిట్ చేయాలని సూచించారు. హాస్పిటల్ హెచ్ఆర్, అటెండెన్స్ , ఎక్విప్ మెంట్, మెడిసిన్, సానిటేషన్, డైట్ సహా ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖాన్లలో పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు హెల్త్ మినిస్టర్.అన్ని హాస్పిటల్లలో అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచాలన్నారు. ఏజెన్సీల్లో గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈడీడీ కంటే వారం రోజుల ముందే సమీపంలోని

వివరాలు 2లో..

## టార్గెట్ లోకల్ బాడీ.. రంగంలోకి పీసీసీ చీఫ్ మహేష్



- జిల్లాల వారీగా సమీక్షలు
- నేతల మధ్య గ్యాప్ పై చర్చ
- వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ నేతలతో భేటీ పూర్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తన కార్యాచరణ ప్రారంభించారు. ఇవాళ్టి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సమవేశానికి ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలను ఆహ్వానించి

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి వర్షం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మళ్లీ భారీ వర్షం కురుస్తోంది. శనివారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వాన పడుతోంది. బషీర్ బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, నారాయణగూడ, ముషీరాబాద్, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, ఉప్పల్, ఎల్ బీ నగర్, కంటోన్మెంట్, నాగోల్, తార్నాక, నాంపల్లి,

వివరాలు 2లో..



## 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉంది

- కొందరి తీరు కారణంగా తెలంగాణ పోలీస్ బ్రాండ్‌కు అవినీతి మకిలి పట్టిందన్న మాజీ మంత్రి
- రాష్ట్రంలో ప్రభుత్వం దారిలో పోలీసులు నడుస్తున్నట్లుగా ఉందని వ్యాఖ్య
- సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** కొందరు పోలీసు అధికారుల తీరు 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలిపడితే సీనియర్ పోలీస్ అధికారులు

వివరాలు 2లో..




## ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అతిశీ

- సీఎంగా ప్రమాణం చేయించిన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా
- ప్రమాణ స్వీకారానికి హాజరైన కేజ్రీవాల్
- కల్కాజీ నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న అతిశీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీ ముఖ్య మంత్రిగా అతిశీ ప్రమాణ స్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అతిశీతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్,

వివరాలు 2లో..



## రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదు



- ఎఫ్ఐఆర్ నమోదు చేసిన బెంగళూరులోని హైగ్రౌండ్ పోలీసులు
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఆందోళన కలిగించాయన్న అమిత్ మాలవీయ
- రిజర్వేషన్లు తొలగించే కుట్రలో రాహుల్ గాంధీ ఎన్నటికీ విజయం సాధించలేరన్న అమిత్

**హైదరాబాద్ పెన్ పవర్:** లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదైంది. కొన్ని వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంతో పాటు రిజర్వేషన్లను తొలగిస్తామని వ్యాఖ్యలు చేసినందుకు గాను ఆయనపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. అమెరికా పర్యటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో కర్ణాటక బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బెంగళూరులోని హైగ్రౌండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగించాయని, ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు

- అమృత్ పథకంలో రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడ్డారన్న కేటీఆర్
- సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపణ
- రూ.2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ.1000 విలువైన పనులు చేస్తుందా? అని నిలదీత

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మున్సిపాలిటీల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో రేవంత్ రెడ్డి

వివరాలు 2లో..




## టీటీడీకి స్వచ్ఛమైన ఆవు నెయ్యి అందిస్తాం

- టీటీడీ ఈవోకు లేఖ రాసిన తెలంగాణ అధికారి సబ్యసాచి ఘోష్
- నైవేద్యాల కోసం స్వచ్ఛమైన ఉత్పత్తుల సరఫరాకు సిద్ధమని వెల్లడి
- పాలు, పెరుగు ఉత్పత్తుల రంగంలో విజయ డెయిరీ ప్రసిద్ధి గాంచిందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవ స్థానం (టీటీడీ) కోసం తాము స్వచ్ఛమైన ఆవు పాలు, నెయ్యి తదితర పాల ఉత్పత్తులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ విజయ డెయిరీ వెల్లడించింది. ఈ మేరకు టీటీడీ ఈవో శ్యామలరావుకు తెలం గాణ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ లేఖ రాశారు.శ్రీవారికి టీటీడీ సమర్పించే నైవేద్యాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు, నెయ్యి, ఇతర పదార్థాలను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పాలు, పెరుగు ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ సంస్థ ప్రసిద్ధి చెందిందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, విలువైన ఉత్పత్తులను సరఫరా చేసిన చరిత్ర విజయ డెయిరీ కలిగి ఉందన్నారు.



## ప్రస్తుత ఇండస్ట్రీకి అనుగుణంగా సిలబస్ అప్ గ్రేడ్ చేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా మారుస్తున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ క్రమంలో ఐటీఐ కాలేజీల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు . పారిశ్రామిక రంగంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని చెప్పారు. కార్మిక , ఉపాధి కల్పన శాఖ అధికారులతో సీఎం రివ్యూ చేశారు. ఇండస్ట్రీకి అవసరమైన రీతిలో ఏటీసీల్లో సిలబస్ మార్పునకు ఉన్నతస్థాయి కమిటీని నియమించి నిపుణుల సలహాలు, సూచనలతో పాటు స్కిల్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని చెప్పారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు సీఎం రేవంత్ . ఐటీఐలు లేని అసెంబ్లీ నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. రాష్ట్రంలో కనీసంగా వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐటీఐ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృత్తి నైపుణ్యం అందించే ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలు స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధివిధానాలను రూపొందించాలని చెప్పారు రేవంత్.





## కేటీఆర్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తాం

### మంత్రి పొంగులేటి హెచ్చరిక

- రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని నిలదీత
- రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్
- లేదంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:** అమృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. అనవసర ఆరోపణలు చేసినందుకు గాను కేటీఆర్‌పై పరువు నష్టం దావా వేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# నెయ్యి సరఫరాదారులపై చర్యలకు సిద్ధమా..?

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతువుల కొవ్వుల అవశేషాలు వెలుగు చూశాయని, అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల క్రితం ఎన్డీఏ వంద రోజుల పాలన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేశారు. టీటీడీకి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతపై నిర్వహించిన పరీక్షల్లో దిగ్భ్రాంతి పరిచే వాస్తవాలు వెలుగు చూసినట్టు గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి నివేదికలను విడుదల చేశారు.జూలై నెల మొదటి వారంలో తిరుమలలో సేకరించిన నెయ్యి శాంపిల్స్ ఆధారంగా గుజరాత్‌కు చెందిన నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ అనుబంధ కాఫ్‌లో తిరుమలలో సేకరించిన నెయ్యి పరీక్షలు జరిపారు. దీనిపై కలవరపెట్టే విషయాలు వెలుగు చూశాయి. నెయ్యి తయారీకీ అవసరమైన ఎస్ వాల్యూ 95.8-104.32 శాతం మధ్య ఉండాల్సి ఉండగా టీటీడీ నుంచి సేకరించిన శాంపిల్స్‌లో 20శాతం లోపే ఉంది. జూలైలోనే ఈ నివేదిక టీటీడీకి అందింది. దీని ఆధారంగా నెయ్యి సరఫరాదారులపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక నుంచి నందిని డైరీ నుంచి నెయ్యి సరఫరాను పునరుద్దరించారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వుతో పాటు, ఇతర మార్గాల్లో కల్తీ జరిగిందని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా టీటీడీకి ప్రైవేట్ సంస్థలతో పాటు, సహకార రంగంలో ఉన్న డైరీలు అందిస్తున్న నెయ్యి ధరలను చూస్తే ఆ ధరలతో నెయ్యి సరఫరా ఎలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం తిరుమలకు సరఫరా చేస్తున్న నెయ్యిని రూ.470 కు నుంచి కొనుగోలు చేస్తున్నారు. టెండర్లలో ఎల్1గా నిలచిన కంపెనీల నుంచి ఎలాంటి పరీక్షలు లేకుండా నేతిని టీటీడీ కొనుగోలు చేస్తోంది. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఇతర ప్రాంతాల నుంచి సేకరించి వాటిని టీటీడీకీ సరఫరా చేస్తున్నట్టు ప్రైవేట్ డైరీ సంస్థలు చెబుతున్నాయి. కొన్నేళ్ల క్రితం విజయవాడ నుంచి ట్యాంకర్లలో నకిలీ నెయ్యిని తిరుమలకు సరఫరా చేస్తుండగా టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా మాఫీ చేశారు.సాధారణంగా ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యి తయారీకి 25 లీటర్ల నుంచి 40 లీటర్ల వరకు పాలు అవసరం అవుతాయి. పాలలో ఉండే వెన్న శాతం ఆధారంగా వెన్న లభ్యత ఉంటుంది. ఆవు పాలలో నెయ్యి శాతం గరిష్టంగా 4- 6 శాతానికి మించి ఉండే అవకాశాలు ఉండవు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఆవుల పెంపకం పెద్దగా ఉండదు. ఏపీలో చిత్తూరు, రాయలసీమ జిల్లాలో కూడా ఆవుల పెంపకం ఉంది. టీటీడీ రోజువారీ అవసరాలతో పాటు లడ్డూ ప్రసాదాల తయారీకి టన్నుల కొద్ది నెయ్యిని వినియోగిస్తారు.దేశీయ పద్ధతుల్లో శుద్దమైన ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యికి లీటరు ఆవుపాలను లీటరుకు రూ.65రుపాయలకు కొనుగోలు చేస్తే రూ. 1625 నుంచి రూ.2275 ఉత్పత్తి వ్యయం అవుతుంది. ఒక్కోసారి కిలో నెయ్యి తయారీకి 40లీటర్ల పాలు కూడా అవసరం అవుతాయని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. పాల సేకరణ, వెన్నను తీసి, నెయ్యి తయారు చేసే క్రమంలో ఉత్పత్తి దారుడికి అయ్యే ఖర్చును కలుపుకుంటే లీటరు ధర వెన్న శాతం ఆధారంగా కిలో నెయ్యి ధర రూ.2వేలకు తక్కువ ఉండదు. అత్యంత ఖరీదైన ఆవు నెయ్యిని ఎల్1 టెండర్‌లో గత ప్రభుత్వ హయంలో సగటున రూ.400కు కేటాయించారు. ప్రస్తుతం నందిని సంస్థ నుంచి రూ.470 కొనుగోలు చేస్తున్నారు. అంత ఖరీదైన ఆవునెయ్యిని టన్నులకు టన్నులు టీటీడీకి రూ.450-500 ఎలా సరఫరా చేయగలుగతారనే ప్రశ్నకు సహేతుకమైన సమాధానాలు ఎవరి వద్ద లేవు. సీఎం ఆరోపణల నేపథ్యంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన వివరణలో కూడా కొన్ని వివరాలు బయటపెట్టారు.శ్రీవారి నైవేధ్యాల కోసం నిత్యం 60కేజీల స్వచ్ఛమైన నెయ్యిని దాతల సహకారంతో గుజరాత్, రాష్ట్రాల్లోని గోశాల నుంచి లక్ష రుపాయల వ్యయంతో కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రోజుకు 60కిలోలను లక్ష రుపాయల చొప్పున నెలకు రూ.30లక్షలు ఖర్చు చేస్తున్నట్టు సుబ్బారెడ్డి స్వయంగా వెల్లడించారు. ఆ లెక్కల్లో కిలో ధర రూ.1667 పలుకుంది. స్వామి వారి నైవేధ్యానికి వినియోగించే నెయ్యి ధర రూ.1667 ఉన్నపుడు, లడ్డూ ప్రసాదాలకు వాడే నెయ్యి కిలో రూ.470కు ఎలా వస్తుందనేది మరో ప్రశ్న. స్వామి వారి నైవేద్యంలలో వాడే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి ఒక్కటి కాదని వైవీ సుబ్బారెడ్డి స్వయంగా అంగీకరించినట్టైంది.వైసీపీ ప్రభుత్వంలో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసే నెయ్యిని ట్యాంకర్లలో సరఫరా చేస్తే కిలో రూ.390కు, 15లీటర్ల క్యాన్లలో కొనుగోలు చేస్తే రూ.409 చొప్పున సేకరించారు. సగటున రూ.400 చొప్పున కిలో నెయ్యి కొనుగోలు చేశారు.గత ఏడాది టీటీడీ నెయ్యి కొనుగోళ్ల కోసం రూ.207 కోట్లన ఖర్చు చేసింది. కిలో రూ.400చొప్పున ఏడాదిలో దాదాపు 51,75,000 కేజీల నెయ్యిని పలు సంస్థల నుంచి కొనుగోలు చేశారు. అంటే సగటున రోజుకు 14,178కేజీల నెయ్యిని ప్రసాదాల తయారీలో వినియోగించారు. ఇందుకోసం 5175 టన్నుల నెయ్యిని రూ.207 కోట్లను టీటీడీ వెచ్చించింది. టీటీడీకి సరఫరా చేసే నెయ్యి కల్తీ వ్యవహారంలో పైకి కనిపించని కోణాలు చాలా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి లభ్యత అంత సులువు కాదని డైరీ రంగంలో పనిచేసే వారు చెప్పే మాట... రాయలసీమలో ఆవుల ద్వారా పాడిపరిశ్రమ నిర్వహించే డైరీ నిర్వాహకులు గతంలో టీటీడీని నెయ్యి సరఫరాకు సంప్రదించినా అప్పట్లో తమకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారుదేశంలో కర్ణాటక డైరీ ఫెడరేషన్‌తో పాటు కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రమే ఆవుపాలను సేకరించి ఉత్పత్తులు చేస్తున్నాయి. 4 నుంచి 6శాతం మాత్రమే కొవ్వు ఉండే ఆవు పాల నుంచి నెయి తీయాలంటే 15 టన్నుల నెయ్యి కోసం 6 లక్షల లీటర్ల పాలు వాడాల్సి ఉంటుందని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. అంటే సగటున ప్రతి కిలో నెయ్యికి 40లీటర్ల పాలు వినియోగించాల్సి ఉంటుంది. టీటీడీ లడ్డూ ప్రసాదాల కోసం కొనే నెయ్యిలో ఖచ్చితంగా కల్తీ జరగడానికి అవకాశం ఉంటుందని చిత్తూరుకు చెందిన ప్రైవేట్ డైరీ నిర్వాహకుడు వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై చేసిన వ్యాఖ్యల్లో లాభనష్టాలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రాజకీయ కోణంలో చూస్తే గత ప్రభుత్వాల హయంలో జరిగిన పొరపాట్లు తమకు చుట్టుకోకుండా చంద్రబాబు జాగ్రత్తపడ్డారనే వాదనలు ఉన్నా, అంతకు మించి భక్తుల మనస్సులో సందేహాలను నాటాయి. ఇకపై తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులు అనుమానపు చూపులు చూసే ప్రమాదం ఉంటుంది.ఆవుకొవ్వు, పందికొవ్వు అంటూ రాజకీయ వ్యాఖ్యలు స్వామి వారి లడ్డూ ప్రసాదాలపై సామాన్య ప్రజల్లో ఉండే భక్తిభావంపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు గుజరాత్ ల్యాబరేటరీ రిపోర్టులను బయటపెట్టకపోతే భవిష్యత్తులో వైసీపీ వాటినే తమపై ప్రయోగించి ఉండేదనే అనుమానం టీడీపీ వర్గాల్లో ఉంది. కోట్లాది మంది భక్తుల కొలిచే కలియుగ ప్రత్యక్ష దైవం చుట్టూ ఏపీలో జరుగుతున్న రాజకీయం భక్తుల మనోభావాలతో సంబంధం లేకుండా సాగుతోంది.తిరుమల వెళ్లిన భక్తుల్ని ఇతరులు దేవుడి కంటే ముందు లడ్డూ ప్రసాదం గురించే అడుగుతారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పుల్ని ఎత్తి చూపడానికి ఉపయోగపడినా భక్తుల హృదయాల్లో అంతకుమించి అనుమానపు బీజాలు నెలకొల్పడానికి ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కారణమవుతాయనే అభిప్రాయం ఉంది.

# టార్గెట్ లోకల్ బాడీ.. రంగంలోకి పీసీసీ చీఫ్ మహేష్

- మొదటి పేజీ తరువాయి
సమీక్ష చేస్తున్నారు. చిన్న చిన్న గ్యాప్ లు ఉంటే సరిదిద్దుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు. ఈ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ తో పాటు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షి కూడా పాల్గొంటున్నారు. ప్రతి విషయాన్ని కాంక్రీట్ గా చర్చిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పార్టీకి పోలైన ఓట్ల శాతం.. ఎంపీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, తక్కువ ఓట్లు వచ్చిన నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై మహేశ్ కుమార్ గౌడ్ ఆరా తీస్తున్నారు. మంత్రులు సొంత పార్టీ కేడర్ కు టైం ఇవ్వాలని, వాళ్ల కష్ట సుఖాల్లో భాగస్వాములు కావాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీలో చేరిన కొత్త నేతలు, పాత నేతల మధ్య మనస్పర్థలు లేకుండా కలిసి మెలిసి పనిచేయాలని సూచిస్తున్నారు. ఎక్కడికక్కడ సోషల్ మీడియా విభాగాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు

# కేటీఆర్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తాం

- మొదటి పేజీ తరువాయి
సమావేశంలో మాట్లాడుతూ... రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలన్నారు. గత ప్రభుత్వమే టెండర్లను రూ.3,616 కోట్ల చొప్పున మూడు ప్యాకేజీలుగా పిలిచిందన్నారు. పోలింగ్ తేదీకి ఒకరోజు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే ఈ టెండర్లను కట్టబెట్టిందన్నారు. రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని, నిరూపించకుంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. తమ ప్రభుత్వం కేవలం రూ.3,516 కోట్ల పనులకే టెండర్లు పిలిచిందని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ పేరుతో రూ.39 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి సూచనలు చేయాలని, సద్విమర్శలు చేయాలని కేటీఆర్‌కు సూచించారు. ఈ టెండర్లలో ఒక దానిని ఖమ్మంలో తనపై పోటీ చేసిన ఉపేందర్ రెడ్డి కూడా దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లు వేయవద్దని తాము ఎవరినీ బెదిరించలేదన్నారు.

# 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లుగా ఉంది

- మొదటి పేజీ తరువాయి
పడిన శ్రమ వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు హరీశ్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.
యువ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి... వాళ్లకు పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని నేర్పించాలని హితవు పలికారు. కానీ రాష్ట్రంలో రాజు తీరుగా పోలీసులు ఉన్నారన్నట్లుగా పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు.
కేసీఆర్ ఆలోచనలతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని గత పదేళ్ల కాలంలో దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దామన్నారు. ఆ ప్రక్రియలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల అనుభవంతో కూడిన పాత్ర కచ్చితంగా ఉందని ప్రశంసించారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి వర్షం

- మొదటి పేజీ తరువాయి
లక్డీకపూల్, బంజారా హిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్ పేట్, ఎస్ఆర్ నగర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. భారీ వర్షం కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీస్‌లు ముగిసి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. నగరంలో భారీ వర్షం కురుస్తోన్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ అయ్యారు. లో తట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో వరద నీరు నిలిచే ఏరియాల్లో తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే నగరవాసులకు అధికారులు కీలక సూచనలు చేశారు. భారీ వర్షం కురుస్తుండటంతో ఇండ్ల నుండి బయటకు వెళ్లొద్దని.. అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు అప్పగించారు

- మొదటి పేజీ తరువాయి
కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి బావమరిది కంపెనీకి పనులు అప్పగించారన్నారు. రూ.2 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ రూ.1,000 కోట్ల పనులు చేస్తుందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ టెండర్ల అవినీతిపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు కేటీఆర్ చెప్పారు. ప్రభుత్వం చేసిన అక్రమాలను వెలికి తీస్తామన్నారు.

## అక్రమ సంబందంతోనే హత్య

**కాకినాడ, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్రగడ ఈశ్వర దుర్గ ప్రసాద్ మృతదేహం ఈనెల 15వ తేదీన కాకినాడ అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులకు లభించింది. నగర 3 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.మృతుని బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని త్రీ టౌన్ సి ఐ సత్యనారాయణ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. అక్రమ సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు గుర్తించామన్నారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సి ఐ సత్యనారాయణ తెలిపారు.

## ఏఓబి లో మావోయిస్టు 20వ ఆవిర్భావ దినోత్సవం

### అప్రమత్తమయిన భద్రతాదళాలు

### భయందోళనల్లో ప్రజలు

**చింతపల్లి, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** ఆంధ్ర ఒరిస్సా బోర్డర్లో సిపిఐ మావోయిస్టు 20వ ఆవిర్భావ దినోత్సవం నేటి నుండి సెప్టెంబర్ 20వ వరకు జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు ఆంధ్ర ఒరిస్సా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరట లేఖ విడుదల చేశారు. దీంతో ఏఓబిలో ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. అడవుల్లో పోలీసులు అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. పోలీస్ కూంబింగ్ ముమ్మరం చేశారు. ప్రతి వెహికల్ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బాంబు స్క్వాడ్ తో కల్వర్టులు వంతెన లు వద్ద తనిఖీలు చేస్తున్నారు. పోలీస్ ఇంటిలిజెన్స్ నిఘా వర్గాలతో కనిపెడుతున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. దీంతో మన్యవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు.

## వీర మహిళల ఆగ్రహం

**కాకినాడ, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజవర్గంలో వీర మహిళలు ఆగ్రహం గా ఉన్నారు. ఇక్కడ పార్టీ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు పై వారు మండిపడుతున్నారు. ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తమను గుర్తించడం లేదని వీర మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా శనివారం ఓ మహిళ పిఠాపురంలో వీర మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని వాయిస్ రికార్డు చేసి అన్ని గ్రూపులకు పంపించారు. పవన్ కళ్యాణ్ వద్ద తేల్చుకుంటామని ఆరోపించారు . మరోపక్క పిఠాపురం టిడిపి ఇన్చార్జి వర్మ ఆగ్రహంగా ఉన్నారు. తనను పట్టించుకోవడం లేదన్నా అసంతృప్తి ఆయనలో ఉంది. తాజాగా వీర మహిళలు రోడ్డు ఎక్కడం పిఠాపురంలో జనసేన పార్టీకి ఇబ్బందిగా తయారయ్యాయని సీనియర్ కేడర్ వాపోతోంది.

## తిరుపతి లడ్డు స్వచ్ఛత విషయంలో భక్తుల ఆందోళన

**అనపర్తి, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** ఇటీవల సామాజిక మాధ్యమాలలో తిరుపతి లడ్డు స్వచ్ఛత తయారీ నాణ్యతలో కొవ్వు పదార్థాలు కలుపుతున్నారన్న విషయంపై... తూర్పుగోదావరి అనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో కలిసి ఆలయ పూజారి మోకాలుపై క్షమాపణలు చెబుతూ అపరాధ పూజలు చేశారు... ఈ విషయమై మాట్లాడిన భక్తులు నిందితులను కఠనంగా శిక్షించకపోతేహిందూ సంస్థల ఆధ్వర్యంలో నిరసనకు దిగుతామంటూ ఆవేదన వ్యక్తం చేశారు..

# ఆపరేషన్ మూసీ.. ప్రక్షాళనకు తొలి అడుగు

- మొదటి పేజీ తరువాయి
హైడ్రా సహకారం తీసుకోనుందని తెలుస్తోంది. నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇవాళ మంత్రి పొన్నం ప్రభాకర్ పిల్లిగుడిసె,వనస్థలిపురంలో పర్యటించారు. మూసీలో ఇండ్లు నిర్మించుకున్న వారితో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు.

# తనిఖీల వివరాలు ప్రతి నెల నాకు రిపోర్ట్ చేయాలి

- మొదటి పేజీ తరువాయి
హాస్పిటల్ కు తరలించి, బర్త్ వెయిటింగ్ రూమ్స్ ను కేటాయించాలన్నారు. ఐటీడీఏల పరిధిలో హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు మంత్రి.
డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, టాస్క్ ఫోర్స్ కమిటీలపై ప్రతి నెలా రివ్యూ చేస్తానన్నారు మంత్రి దామోదర. అన్ని వివరాలతో రివ్యూకు అటెండ్ కావాలని అధికారులకు సూచించారు. అన్ని ప్రభుత్వ దవాఖాన్లలో బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి.

# ఢిల్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అతిశీ

- మొదటి పేజీ తరువాయి
తదితరులు హాజరయ్యారు. గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేశ్ అహ్లావత్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ కావడం తెలిసిందే. కొన్ని నెలలు తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్ ఇటీవలే బెయిల్ మీద విడుదలయ్యారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతో అతిశీ సీఎంగా ప్రమాణం చేశారు.అతిశీ కల్కాజీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమె ఇంతకుముందు కేజ్రీవాల్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 17న జరిగిన పార్టీ శాసనసభ్యుల సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు అతిశీని సీఎంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, ఢిల్లీ సీఎం పీఠం ఎక్కిన అతి పిన్న వయస్కురాలిగా అతిశీ ఘనత అందుకున్నారు.

# రాహుల్ గాంధీపై కర్ణాటకలో ఎఫ్ఐఆర్ నమోదు

- మొదటి పేజీ తరువాయి
బీజేపీ ఉండగా... ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు తొలగించే కుట్రలో రాహుల్ గాంధీ ఎన్నటికీ విజయం సాధించలేరని పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... కొన్ని అంశాలపై భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనార్టీ మాత్రమే ఉన్నారని రాహుల్ గాంధీ తెలిపారు.
కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయన్నారు. అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవన్నారు.

# ఇండియన్ కోస్ట్ గార్డ్ ఆధ్వర్యంలో ఘనంగా ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ కార్యక్రమం

**కాకినాడ, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** కాకినాడ రూరల్ ఎన్టీఆర్ బీచ్ లో శనివారం తీరప్రాంత పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న వివిధ కంపెనీల ప్రతినిధులు తో పాటు సూర్యరావుపేట గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కాకినాడ మున్సిపల్ ఉద్యోగులు, కోస్టల్ పోలీసులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి బీచ్ లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నాష్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో అధిక శాతం ప్రజలు ప్లాస్టిక్ నీ అత్యధికంగా వినియోగిస్తున్నారని దీనివల్ల పర్యావరణం పై తీవ్ర ప్రభావం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తి స్థాయిలో వాడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని తమ బంధువులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులుచే ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కోస్ట్ గార్డ్ స్టేషన్ కమాండర్ కమాండెంట్ రాజేంద్ర కుమార్, కనకలత బరువా షిప్ కమాండింగ్ ఆఫీసర్ కమాండెంట్ ఆర్ఎస్ఎస్ బీశెట్టి, కాకినాడ సీ పోర్టు సీఈవో మురళిధర్ , రిలయన్స్ కంపెనీ నుండి లంక మురళి పాల్గొన్నారు.

# 3 లక్షల లడ్డూలు విక్రయం.. 500 కోట్ల వార్షిక ఆదాయం.



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరుమల, సెప్టెంబర్ 21:** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పవిత్ర తిరుపతి ఆలయంలో లభించే లడ్డూలను భక్తులు ఎంతో శ్రద్ధతో ప్రసాదంగా గ్రహిస్తారు. ఈ లడ్డూలు దేశవ్యాప్తంగా పంపిణీ జరుగుతాయి. తిరుమల తిరుపతి దేవస్థానంలోని (టిటిడి) వంటశాల అయిన పోటులో మాత్రమే వీటిని తయారు చేస్తారు. లడ్డూ తయారీ ప్రక్రియకు దిట్టం అని పేరు కూడా ఉండడం విశేషం.దిట్టం ప్రక్రియ ప్రకారం లడ్డూలో ఏయే పదార్థాలు ఎంత మోతాదులో వేయాలో అన్ని పక్కాగా నిర్ధారణలుంటాయి. అయితే ఈ దిట్టం ప్రక్రియ తిరుమల దేవస్థానం చరిత్రలో ఆరుసార్లు మార్చడం జరిగింది. 2016 టిటిడి రిపోర్ట్ ప్రకారం.. శ్రీవారి ప్రసాదమైన లడ్డూలు దివ్య సుగంధం కలిగి ఉంటుంది. ఈ లడ్డూ తయారీలో ముఖ్యమైన పదార్థం బూందీ తయారు చేయడానికి శనగపిండి, బెల్లం పాకం ఉపయోగిస్తారు. బెల్లం పాకంతో తయారు చేయడం వల్ల లడ్డూ ఎక్కువ కాలం నిలువ ఉంటుంది. ఆ తరువాత బాదం పప్పు, కాజు, ఎండ్ర ద్రాక్షని వీటిలో అదనంగా వేస్తారు. దీని లడ్డూలో పౌష్టిక విలువ పెరుగుతుంది.ప్రతి రోజు తిరుమలలో 3 లక్షల లడ్డూలు తయారు చేస్తారు. లడ్డూల ద్వారా టిటిడి బోర్డుకి ఏడాదికి రూ.500 కోట్ల ఆదాయం సమకూరుతోందని అంచనా. తిరుమలో లడ్డూ ప్రసాదానికి 300 ఏళ్ల ఘనచరిత్ర ఉంది. మొదటిసారి శ్రీవారి ప్రసాదంగా 1715 సంవత్సరంలో భక్తులకు లడ్డూని అందించడం ప్రారంభించారు. 2014 సంవత్సరంలో తిరుపతి లడ్డూలకు జిఐ స్టేటస్ లభించింది. ఈ స్టేటస్ లభించిన ఆహార పదార్థాలు ఇతరులు అదే పేరుతో విక్రయించకూడదు.తిరుమల లడ్డూలు తయారీ సమయంలో వాటి నాణ్యత కోసం టిటిడి లేబరేటరీలో పరీక్షిస్తారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం.. అందులో చక్కెర, కాజు, యాలకలు (ఇలాయిచీ) అన్నీ సమపాళ్లలో ఉండాలి. ప్రతీ లడ్డూ బరువు 175 గ్రాములుండాలి.అయితే తిరుమల లడ్డూల తయరీలో పశువుల కొవ్వు ఉయోగించారిన తాజాగా వివాదం నెలకొంది. గత కొంత కాలంగా లడ్డూ నాణ్యత సరిగాలేదని, రుచి, సుగంధం మునుపటిలా లేవని చాలా మంది భక్తులు ఫిర్యాదు చేయగా.. జూలై 2024లో తిరుమల లడ్డూని అందులో ఉపయోగించే నెయ్యిని పరీక్షలు చేశారు. గుజరాత్ లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి) ఈ పరీక్షలు చేసి నివేదిక అందించింది. నివేదికలో ఉన్న వివరాల ప్రకారం.. లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ చేశారని తేలింది. ముఖ్యంగా నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు పరీక్షలో తేలింది. చేప నూనె, టాలో (ఆవు లేదా ఎద్దు కొవ్వు), లార్డ్ (పంది కొవ్వు) ఉన్నట్లు ఎన్‌డిడిబి తన రిపోర్ట్ లో పేర్కొంది.ఈ నెయ్యి తమిళనాడ దిండిగల్ కు చెందిన ఏఆర్ డైరీ తిరుమల దేవస్థానానికి పంపిణీ చేసేది. ఇప్పుడు నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని రిపోర్ట్ రావడంతో ఏఆర్ డైరీతో టిటిడి కాంట్రాక్టు రద్దు చేసుకుంది. దేవస్థానంలో ఉన్న నెయ్యి స్టాక్ ను తిరిగి ఏఆర్ డైరీ పంపించేసింది. ఇంతవరకు ఏఆర్ డైరీ నుంచి కిలో నెయ్యి రూ.320కు టిటిడి కొనుగోలు చేసేది. ఇప్పుడు కాంట్రాక్టు రద్దు చేసి కర్ణాటకు చెందిన నందినీ డైరీతో నెయ్యి పంపిణీ కాంట్రాక్టు కుదుర్చుకుంది. నందినీ డైరీ కిలో నెయ్యి రూ.475 కు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం.అయితే గతంలో నందినీ డైరీ నుంచే టిటిడి నెయ్యి కొనుగోలు చేసేది. కానీ ఆంధ్ర ప్రదేశ్ లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి టిటిడిలో కీలక మార్పులు చేశారు. అందులో భాగంగానే టిటిడి బోర్డు నెయ్యి పంపిణీ కాంట్రాక్టుని నందినీ డైరీతో రద్దు చేసుకొని ఏఆర్ డైరీకి అప్పగించింది. దీంతో తిరుమల పవిత్ర ప్రసాదంలో కల్తీ నెయ్యికి వైసీపీ ప్రభుత్వం కారణమని ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఆరోపణలు చేస్తోంది.లడ్డూలో నాణ్యతా లోపాలు వెలుగుచూడడానికి ప్రధాన కారణం టిటిడి కొత్త ఈవో ఐఎఎస్ జె. శ్యామల రావు. ఆయన జూన్ 2024లో టిటిడి ఈవోగా నియమితులయ్యారు. లడ్డూ నాణ్యతపై భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆయన పరీక్షలకు ఆదేశించారు.

## విడుదల రజనీ అరెస్ట్ తప్పదా



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ గుంటూరు, సెప్టెంబర్ 21:** వైసీపీ నేతలకు కష్టాలు వెంటాడుతున్నాయా? ఈ జాబితా మరింత పెరిగే అవకాశముందా? తాజాగా మాజీ మంత్రి విడుదల రజనీ కూడా అందులో చేరిపోయారా? రేపో మాపో రజనీ అరెస్ట్ తప్పదా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.గడిచిన ఐదేళ్ల కాలం వైసీపీ స్వర్ణయుగం. ముఖ్యంగా నేతలకు కూడా. ఎందుకంటే బెదిరింపులు, దందాలకు పాల్పడినట్టు తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఏపీలో ప్రభుత్వం మారడంతో బాధితులు ఒకొక్కరుగా బయటకు వస్తున్నారు. ఇప్పుడు మాజీ మంత్రి విడుదల రజనీ వంతైంది. ఆమె పేరిట బంధువులు వసూళ్ల దందాపై విచారణకు ఆదేశించారు హోంమంత్రి అనిత.పల్నాడు జిల్లా పేరు చెప్పగానే ముందుగా గుర్తు కొచ్చేది స్టోన్ క్రషర్ బిజినెస్. అక్కడ ఆ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. దీన్ని గమనించిన కొందరు వైసీపీ నేతలు దందాకు దిగారు. వ్యాపారుల నుంచి డబ్బులు వసూళ్లకు ప్లాన్ చేశారు. మాజీ మంత్రి చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆమె బంధువుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. పీఏ ద్వారా నిధుల వసూళ్లకు తెరలేపారు.డబ్బులు ఇవ్వకుంటే వ్యాపారం జరగదంటూ బెదిరింపులకు దిగారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని అర్థం చేసుకోలేకపోయారు. ఈ వ్యవహారంపై బాధితుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. పరిస్థితి గమనించిన మంత్రి అనిత.. వసూళ్ల వ్యవహారంపై నిగ్గు తేల్చాలంటూ పల్నాడు ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు.చిలకలూరిపేట నియోజకవర్గంలోని జగనన్న కాలనీల పేరిట గతంలో మాజీ మంత్రి అనుచరలు డబ్బులు వసూలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విడుదల వర్గీయులు, రైతుల వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేశారు.వివిధ వర్గాలకు చెందినవారి నుంచి డబ్బులు వసూలు చేసినట్టు మాజీ మంత్రి పీఏతోపాటు రజనీ మరిది గోపీనాథ్ పై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇప్పటికే ఆమె పీఏ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మాజీ మంత్రి ఎక్కడా నోరు ఎత్తిన సందర్భం రాలేదు. విచారణ జరిగే సమయంలో వారంతా బయటకు వస్తారా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది.


## రామచర్లపాడు వద్ద జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదం ఒకరు మృతి

**నెల్లూరు, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** కొడవలూరు మండలం రామచర్లపాడు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కె శ్రీ కార్గో కంటైనర్ ఆగి ఉన్న లారీని వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ లక్ష్మణరావుకు కాలికి తీవ్ర గాయాలు కాగా, పక్కనే ఉన్న వ్యక్తి కొండేటి రవి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి విజయవాడకు చెందిన వారు గా పోలీసులు గుర్తించారు. గాయపడిన వ్యక్తిని హైవే అంబులెన్స్ ద్వారా హైవే మొబైల్ సిబ్బంది వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కొడవలూరు ఎస్సై కోమటిరెడ్డి కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

## లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ఎన్నికల కమిషనర్

**యాదాద్రి భువనగిరి, పెన్‌పవర్ సెప్టెంబర్ 21:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని దేవి శనివారం యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొనగా.. పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఈవో భాస్కర్ రావు అందించారు. యాదాద్రి దేవాలయం నిర్మాణం చూసి ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

## జనసేనలో చేరికలు.. గుర్రుగా కూటమి నేతలు



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ ఒంగోలు, సెప్టెంబర్ 21:** ప్రస్తుతం టీడీపీలో లీడర్ షిప్ కు కొదవలేదు. ఫుల్ టైట్ గా ఉంది. అయితే వైసీపీ అసంతృప్తుల్లో చాలా మంది జనసేనవైపు చూస్తుండడం ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారుతోంది. అటు జనసేనకు కూడా పెద్ద నాయకుల అవసరం ఉంది. రాజకీయాల్లో వలసలు కామన్. కలిసి వచ్చే వారిని కలుపుకొని పోవడమూ అంతే కామన్. అయితే ఈ వలసలు కాస్తా కూటమి ప్రభుత్వానికి ఎంత వరకు ఎఫెక్ట్ చూపుతాయన్నది కీలకంగా మారింది. కూటమి పరిణామాలు మారుతాయా? ఇబ్బంది రాకుండా డీల్ చేస్తారా అన్నది హాట్ టాపిక్ అవుతోంది.వైసీపీ నుంచి వలసలు ఆటోమేటిక్ గా కూటమివైపు వస్తున్నాయి. అక్కడ గుడ్ బై చెబుతున్న వారు అయితే టీడీపీ లేదంటే జనసేన వైపు చూస్తున్నారు. ముఖ్యంగా టీడీపీతో గతంలో చాలా విబేధించిన వారైతే తమకు ఆప్షన్ గా జనసేనను చూస్తున్నారు. అటు జనసేన పార్టీకి కూడా బలమైన క్యాడర్ ఉన్నా.. పెద్ద స్థాయి నేతలు లేక ఎదగలేకపోతోంది. నిజానికి మొన్నటి ఎన్నికల్లోనూ చాలా మంది చివరి నిమిషంలో టీడీపీ నుంచి జనసేనలో వచ్చి చేరిన వారే టిక్కెట్లు దక్కించుకున్నారు. ఇప్పుడు కూడా జనసేనలో పెద్ద స్పేస్ కనిపిస్తోంది. ఇది వైసీపీ నుంచి బయటకు రావాలనుకుంటున్న నేతలకు ప్లస్ పాయింట్ గా మారింది.ఒంగోలు కార్పొరేషన్ లో కార్పొరేటర్లలో చాలా మంది బాలినేని శ్రీనివాసరెడ్డికి దగ్గరి వారే ఉన్నారు. ఇటీవలే వారంతా టీడీపీలో చేరారు. ఒకవేళ బాలినేనికి జనసేనలో లైన్ క్లియర్ అయితే వారు అక్కడికి షిఫ్ట్ అవుతారా అన్నది కీలకంగా మారింది. ఇదే జరిగితే కూటమిలో కాస్త గడబిడ ఖాయమే అంటున్నారు. మరోవైపు పార్టీలోకి బయటి నుంచి ఒకరు వస్తుంటే అప్పటికే పార్టీలో ఉన్న వారిలో అసంతృప్తి సహజమే. ఇప్పటికే ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ సైతం సైలెంట్ అయిపోయారు. దీన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలా టాకిల్ చేస్తారన్నది కీలకంగా మారింది.వైసీపీ నుంచి జనసేనలోకి రావాలనుకుంటున్న లీడర్లతో ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యేలకు చెక్ పడుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కూటమిలోకి తప్పులు చేసిన వారు అక్కర్లేదని, కుళ్లిన కోడిగుడ్లు వద్దే వద్దంటున్నారు కూటమి నేతలు. మంచి వాళ్లనే ఆమోదిస్తామంటున్నారు.వైసీపీ నుంచి సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా పార్టీ నుంచి వైదొలుగుతున్నారు. క్యాడర్, లీడర్ షిప్ అంతా నిరాశ నిస్పృహలతోనే వీడుతున్నారా అన్న డౌట్లు పెరుగుతున్నాయి. ఇన్నాళ్లూ జగన్ వెంట తిరిగి వారే ఇక మీ వెంట నడవడం మా వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. కొందరు అంటీ ముట్టనట్లుగా ఉంటే.. ఇంకొందరు గుడ్ బై చెబుతున్నారు. ఇటీవలే వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఉన్న ఎమ్మెల్సీ పోతుల సునీత వైసీపీకి రాజీనామా చేశారు. అటు వైసీపీ రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణ కూడా పార్టీ వీడారు. మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కూడా గుడ్ బై చెప్పేశారుఇటీవలే వైసీపీకి రాజీనామా చేసిన వారిలో కిలారు రోశయ్య, మద్దాలి గిరి, పెండెం దొరబాబు, నూర్జహాన్ ఉన్నారు. ఇందులో నూర్జహాన్ ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ గా ఉన్నారు.

ఆ దంపతులిద్దరూ జగన్ కు గుడ్ బై చెప్పేశారు. పార్టీలో ఇన్నాళ్లు కీలక వ్యవహరించిన మాజీ మంత్రులు, తాజా మాజీలు, వైఎస్ కుటుంబానికి వీర విధేయులుగా ఉన్న వారంతా ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్‌బై చెబుతుండడం వైసీపీలో హాట్ టాపిక్ అయింది. పార్టీ ఓడిపోయింది కాబట్టి నాయకులంతా వైసీపీని వీడుతున్నారని అనుకోవడానికి లేదంటున్నారు. తీవ్రమైన అసంతృప్తి, నాయకత్వంపై నమ్మకం లేకపోవడం, 11 సీట్లకే పరిమితమై ప్రజాదరణ కోల్పోవడం, క్యాడర్ లో నిరాశ ఉండడం ఇవన్నీ కారణాలుగా చెబుతున్నారు.

## 1715 నుంచి తిరుమల లడ్డూ విక్రయం



**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ తిరుమల, సెప్టెంబర్ 2:** కలియుగ వైకుంఠనాథుడు శ్రీనివాసుడి దర్శనం తర్వాత భక్తులు ఎంతగానో ఇష్టపడేది శ్రీవారి లడ్డు ప్రసాదం. భక్తులు తప్పక తమ వారి కోసం తీసుకు వెళ్ళేది లడ్డూలు. ఆ శ్రీవారికి ఎంతటి విశిష్టత ఉందో తిరుమల లడ్డూకు కూడా అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉంది. ఆలయ పోటులో ప్రత్యేకంగా తయారయ్యే ఈ లడ్డూలను స్వామి వారి ప్రసాదంగా పెట్టడం ప్రారంభించి సరిగ్గా 309 ఏళ్లు పూర్తి అయ్యింది. మొదట 1715 ఆగస్టు 2న లడ్డూను ప్రసాదంగా పెట్టడం ప్రారంభించారు.తిరుమల వెంకన్న కోరిన కోర్కెలు తీర్చే దేవదేవుడని, తమ కష్టాలను తొలగించే దివ్య పురుషుడని భక్తుల విశ్వాసం. అందుకే నిత్యం లక్షల సంఖ్యలో భక్తులు తిరుమలకు వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన భక్తులు స్వామి వారి దర్శన అనంతరం, స్వామి వారి ప్రసాదమైన లడ్డూనూ తమతో పాటూ ఇంటికి తీసుకెళ్తారు. ఈ లడ్డూను తమ ఇంటిలో భక్తి శ్రద్ధలతో పూజించి ఆత్మీయులకు పంచి పెడుతుంటారు. ఇంతకి శ్రీవారి లడ్డూ ప్రసాదం ఎప్పుడూ తయారు అయ్యింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం మొదలు పెట్టి ఎన్నేళ్ళు అయ్యింది. తిరుమల శ్రీవారికి సమర్పించే నైవేద్యాలకి పెద్ద చరిత్రే ఉంది. సుప్రభాత సమయంలో స్వామి వారికి వెన్నతో మొదలు పెట్టి, లడ్డూ, వడ, పొంగలి, దద్దోజనం, పులిహోరా, వడపప్పు, ఇలా రకరకాల నైవేద్యాలను నివేదిస్తారు.తిరుమల అనగానే మనకు లడ్డూ మాత్రమే గుర్తుకు వస్తుంది. టీటీడీలో రకరకాలైన ప్రసాదాలు అందుబాటులో ఉన్నప్పటికి, భక్తులకు లడ్డూ ప్రసాదం అంటేనే ఎంతో ప్రీతిపాత్రంగా ఉంటుంది. ప్రసాదాలలో శ్రీవారి లడ్డూ అగ్రస్థానంలో నిలిచింది. ప్రసాదంగా లడ్డూను ఇవ్వడం 1715 ఆగస్టు 2 వ తేదీన ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకూ ఎవరూ ఇందుకు సంబంధించిన కచ్చితమైన తేదీని మాత్రం చెప్పలేక పోతున్నారు. 2010 వరకూ దాదాపు రోజుకు లక్షల లడ్డూలను టీటీడీ తయారు చేసేది.. భక్తుల అధిక రద్దీ కారణంగా ప్రతి నిత్యం దాదాపు మూడు లక్షల ఇరవై వేల లడ్డూలను టీటీడీ తయారు చేస్తోంది. ఇక లడ్డూకు పేటేంట్, ట్రేడ్ మార్క్ కూడా ఉండడం విశేషంగా చెప్పుకోవచ్చు. 2014లో లడ్డూకు భౌగోళిక గుర్తింపు గుర్తింపు లభించింది.శ్రీవారి భక్తులు ఎంతో ప్రీతి పాత్రంగా భావించే లడ్డూ ప్రసాదం

దాదాపు 309 ఏళ్ల కిందట మొదలైందని తెలుస్తోంది. 1715 ఆగస్టు 2న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారు చేసినట్లు చెబుతుంటే.. క్రీ.శ.1803లో బూందీగా పరిచయమైన అటు తరువాత 1940 నాటికి లడ్డూ ప్రసాదంగా స్థిర పడినట్లు కొందరు పండితులు భావిస్తారు. మొదట్లో లడ్డూ ప్రసాదాన్ని ఎనిమిది నాణేలకే ఇచ్చేవారని, అటు తరువాత 2, 5, 10, 15, 25 నుంచి ప్రస్తుతం 50 రూపాయలకు టిటిడి విక్రయిస్తోంది. 1940 వ సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుంటే మాత్రం లడ్డూ వయస్సు 83 సంవత్సరాలు అవుతుందని కొందరు చెబుతారు. లడ్డూకు పేటేంట్, ట్రేడ్ మార్క్ కూడా ఉండడం విశేషంగా చెప్పుకోవచ్చు. పల్లవుల కాలం నుంచే ప్రసాదాలు చరిత్రక ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.. విజయనగర సామ్రాజ్యంలోని రెండవ దేవరాయలు కాలం నుంచి ప్రసాదాల సంఖ్య మరింత ఎక్కువ పెంచినట్టు ఆధారాలున్నాయి.

## ఫ్యాన్ ఉక్కపోత... ఇక మిగిలేది ఎవరు...

**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ గుంటూరు, సెప్టెంబర్ 21:** ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు? జడ్పీ, మున్సిపల్ చైర్మన్లు.. ఇలా ఒకరేంటి వరుసగా వైసీపీని వీడుతున్న నేతల సంఖ్య చాంతాడులా పెరిగిపోతూనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత నైరాశ్యంలో కూరుకుపోయిన పార్టీలో పునరుత్తేజం నింపాల్సిన నేతలు? పూర్తిగా డీలా పడిపోతున్నారా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. వరుసగా నేతల వలసలను పరిశీలిస్తే వైసీపీ నాయకత్వంపై నమ్మకం లేక తట్టాబుట్టా సర్దేస్తున్నారా? అనే సందేహమే ఎక్కువగా వ్యాపిస్తోంది. పదవులు లేని వారు?. మాజీలైన నేతలు అధికార దాహంతో పక్క పార్టీల్లోకి జంప్ చేస్తున్నారని సరిపెట్టుకుందామన్నా?. రాజ్యసభ సభ్యులు, మండలి సభ్యులు కూడా తమ పదవులను వదులుకుని కొత్త పార్టీల్లోకి వెళ్లేందుకు పోటీ పడటమే విచిత్రంగా అనిపిస్తోందంటున్నారు పరిశీలకులు.ఇలా పార్టీని వీడుతున్న వారిలో చాలామంది ఇంతవరకు కొత్తగా ఏ పార్టీలో చేరనేలేదు. ఒకరిద్దరికి టీడీపీ, జనసేనలో తీసుకునేందుకు ఆయా పార్టీలు కూడా ఓకే చేశాయంటున్నారు. కానీ, ఏ పార్టీతోనూ మాట్లాడకుండానే పెద్ద ఎత్తున నేతలు ఎందుకు రాజీనామా చేస్తున్నారనే సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు వైసీపీని వీడిన వారిలో రాజ్యసభ సభ్యులైన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి తమ పదవులకు సైతం రాజీనామా చేశారు.ఐతే వీరిలో మోపిదేవికి టీడీపీ నుంచి ఆహ్వానం ఉండగా, మిగిలిన వారు జంక్షన్‌లో జామ్ అయినట్లు కనిపిస్తున్నారు. పదవులు పోయినా పర్వాలేదు కానీ, వైసీపీలో కొనసాగలేకే వీరంతా పార్టీకి రాం రాం చెప్పేశారంటున్నారు. ఇక మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఆళ్ల నాని, మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య, మద్దాల గిరి, పెండెం దొరబాబు ఇప్పటికే రాజీనామా ప్రకటన చేశారు. ఇప్పుడు ఈ లిస్టులో మరో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేరు కూడా వినిపిస్తోంది.బాలినేని, సామినేని ఇప్పటికే జనసేనతో టచ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతుండగా, మిగిలిన నేతల రాజకీయ భవిష్యత్‌పై ఇంతవరకు క్లారిటీ లేదు. కానీ, వారు మాత్రం వైసీపీతో జర్నీకి ఇష్టపడటం లేదు. దీంతో కొన్నాళ్లు ఖాళీగా ఉన్నా పర్వాలేదు? వైసీపీలో మాత్రం కొనసాగలేమంటూ రాజీనామాలు చేసేశారు. ఐతే ఐదేళ్లు పార్టీలో అన్ని హోదాలు అనుభవించిన ఈ నేతలు ఎందుకు పార్టీని వీడుతున్నారంటే? పార్టీ హైకమాండ్ తమను పట్టించుకోలేదనే ఏకైక కారణం చెబుతున్నారు. మంత్రులుగా పనిచేసిన బాలినేని, ఆళ్ల నాని, ప్రభుత్వ విప్‌గా పనిచేసిన సామినేని ఉదయభాను సైతం పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేయడాన్ని వైసీపీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.ఐనా, వీరు పార్టీ మారతామంటే ఎవరూ ఆపే ప్రయత్నం చేయకపోవడాన్ని తప్పుపడుతున్నాయి. ఇప్పటివరకు దాదాపు డజను మంది నేతలు పార్టీని వీడగా, ఒక్క బాలినేనితో మాత్రమే అధిష్టానం సంప్రదింపులు జరిపింది. అది కూడా బాలినేని కన్నా జూనియర్ అయిన మాజీ మంత్రి విడదల రజినితో రాయబారం నెరపడం కూడా బెడిసి కొట్టిందంటున్నారు. వెళ్లే వారు వెళ్లనీ అన్నట్లు పార్టీ అధిష్టానం వ్యవహరిస్తుండటంతో ఈ వలసలు మరింతగా పెరుగుతున్నాయంటున్నారు.ప్రస్తుతం బయటపడిన పేర్లు కొన్ని మాత్రమేనని? ఇంకా లిస్టులో చాలా మందే ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల నుంచి త్వరలో భారీ వలసలు ఉండొచ్చని చెబుతున్నారు. వైసీపీలో ఉంటే తమ రాజకీయ భవిష్యత్ ప్రమాదంలో పడినట్లేననే భయంతో కాపు సామాజికవర్గం నేతలు ఎక్కువగా పక్క చూపులు చూస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులుగా పనిచేసిన వారు పార్టీని వీడుతుంటే తామేం తక్కువా? అన్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు కూడా టీడీపీ, జనసేనల్లో చేరిపోతున్నారు.చిత్తూరు, నెల్లూరు, ఏలూరు కార్పొరేషన్లలో మెజార్టీ కార్పొరేటర్లు టీడీపీలో చేరిపోయారు. పుంగనూరుతోపాటు చాలా మున్సిపాలిటీల్లో వైసీపీ జెండాను దించేశారు. గుంటూరు, ఏలూరు జిల్లా పరిషత్ లను కూడా టీడీపీ కైవసం చేసుకుంది. ఇంకొన్ని జెడ్పీల్లో కూడా టీడీపీ జెండా ఎగిరేలా ప్లాన్ జరుగుతోందని చెబుతున్నారు. ఇలా పార్టీకి ప్రతి దశలోనూ డ్యామేజ్ జరుగుతున్నా, వైసీపీ అధిష్టానంలో చలనం కనిపించడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎవరు వెళ్లినా తానొక్కడిని చాలన్నట్లు అధినేత జగన్ వ్యవహరిస్తుండటమే అంతుచిక్కడం లేదంటున్నారు పరిశీలకులు. మొత్తానికి వైసీపీ అంతర్గత సంక్షోభం?. వలసలకు కారణమవుతోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీలో చివరికి మిగిలేది ఎందరు అన్న సందేహం వ్యక్తమవుతోంది.

## విజయనగరంలో ఆగని కూల్చివేతలు




**స్టాఫ్‌రిపోర్టర్ పెన్‌పవర్ విజయనగరం, సెప్టెంబర్ 21:** విజయనగరం జిల్లాలో హైడ్రా తరహా కూల్చివేతలు సంచలనంగా మారాయి. జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సైతం కూల్చివేతలు కొనసాగుతున్నాయి. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన మాన్సాస్ ట్రస్ట్ భూముల్లో అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించారనే కారణంతో అధికారులు కూల్చివేతలకు దిగారు. ప్రస్తుతం ఈ మాన్సస్ ట్రస్ట్ కు చైర్మన్ గా మాజీ కేంద్రమంత్రి, తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు వ్యవహరిస్తున్నారు.మాన్సస్ ట్రస్ట్ ను అశోక్ గజపతిరాజు తండ్రి డాక్టర్ పివిజి రాజు 1958లో నెలకొల్పారు. జిల్లాలో విద్యా వ్యవస్థ అభివృద్ధితో పాటు పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్న సదుద్దేశ్యంతో ఈ ట్రస్ట్‌ను ప్రారంభించారు. ట్రస్ట్ ప్రారంభించిన తరువాత ఈ ట్రస్ట్ పర్యవేక్షణలో పలు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. ఆ విద్యాసంస్థల వ్యయప్రయాసలు, బాగోగులు చూసుకునేందుకు సుమారు పదిహేను వేల ఎకరాల భూమిని డాక్టర్ పివిజి రాజు దానం చేశారు. ఆ భూమి ద్వారా వచ్చే సంపాదన ట్రస్ట్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలకు మాత్రమే వినియోగించాలని బైలాస్ లో పొందుపరిచారు. అలా ఆ ట్రస్ట్ పరిధిలో ఉన్న పదిహేను వేల ఎకరాల భూమి పాలకమండలి నిర్ణయం లేకుండా ఎవరు అమ్మడానికి కానీ, కొనుగోలు చేయడానికి కుదరదు. అలా అప్పటి నుండి మాన్సస్ భూములు విద్యాసంస్థలు అభివృద్ధి కోసం మాత్రమే ఉపయోగిస్తూ వచ్చారు.అయితే ఈ క్రమంలోనే జిల్లాకేంద్రంతో పాటు పలు చోట్ల విలువైన మాన్సస్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. అలా అన్యాక్రాంతమైన భూమి మార్కెట్ ధర ప్రకారం కోట్లలోనే ఉంటుంది. ఆ భూముల్లో సుమారు 340 వరకు పక్కా భవనాలు కూడా నిర్మించారు. ఇప్పుడు ఆ భవనాలను తొలగించి భూములను స్వాధీనం చేసుకుంటుంది మాన్సస్ ట్రస్ట్. భవనాలను తొలగించే ముందు నోటీసులు జారీ చేసి చర్యలకు దిగుతోంది. ఈ క్రమంలోనే ధర్మపురిలో నిర్మాణంలో ఉన్న ఒక విల్లాను కూల్చివేశారు. మరికొన్ని నిర్మాణాలు కూడా కూల్చబోతున్నట్లు తెలియజేశారు మాన్సస్ అధికారులు. దీంతో బాధిత కుటుంబాలు లబోదిబోమంటున్నారు. తమకు మాన్సస్ భూమని తెలియదని, వేరే వారి దగ్గర నుండి భూమిని కొనుగోలు చేసి నిర్మాణాలు చేసుకున్నామని గగ్గోలు పెడుతున్నారు. జీవితకాలం కష్టపడి వచ్చిన డబ్బుతో ఇల్లు కట్టుకున్నామని ఇప్పుడు ఆ భూమిని కూల్చివేస్తే తమ జీవితాలు రోడ్డున పడతాయని కన్నీరుమున్నీరు అవుతున్నారు. దీని పై ట్రస్ట్ చైర్మన్ అశోక్ గజపతి రాజు పునరాలోచించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## కొరడా ఝుళిపించిన కంటోన్మెంట్ అధికారులు

**సికింద్రాబాద్, పెన్‌పవర్ సెప్టెంబర్21:** బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోయిన్ పల్లి చెక్పోస్ట్ నుండి సుచిత్ర వరకు (నాగపూర్ హై వే) రహదారి ఇరువైపులా వెలసిన అక్రమ వ్యాపార సముదాయాలపై ఎట్టకేలకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు కొరడా ఝుళిపించారు. ఫుట్పాత్, రక్షణ శాఖ భూములలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగించడమే కాకుండా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగిస్తున్నారని వచ్చిన అనేక పిర్యాదులతో చర్యలకు పూనుకున్నట్లు సానిటరీ సూపరింటెండెంట్ దేవేందర్ తెలిపారు. తొలగించిన వాటిలో పండ్ల దుకాణాలు, నర్సరీలు, గృహోపకర వస్తువుల దుకాణాలు ఉన్నాయి. ఫుట్ పాత్ లను ఆక్రమించడమే కాకుండా రోడ్డు పైనే వాహనాలు నిలిపి రోడ్డు ప్రమాదాలకు కూడా కారణమౌతున్నట్లు పేర్కొన్నారు. మళ్ళీ వ్యాపారాలు మొదలి పెడితే మరింతా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

# చెన్నై పిచ్ పై అశ్విన్ హవా... భారీ లక్ష్యం ముంగిట బంగ్లా ఎదురీత

## చెన్నై టెస్టులో గెలుపు దిశగా టీమిండియా

## బంగ్లాదేశ్ ముందు 515 పరుగుల భారీ లక్ష్యం

## మూడో రోజు ఆట చివరికి 4 వికెట్లకు 158 పరుగులు చేసిన బంగ్లా

## మరో రెండ్రోజుల ఆట మిగిలున్న వైనం




బంగ్లాదేశ్ తో తొలి టెస్టులో టీమిండియా విజయం దిశగా పయనిస్తోంది. 515 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు చేజార్చుకుని 158 పరుగులు చేసింది. సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సొంతగడ్డపై విజృంభించాడు. చివరి సెషన్ లో 3 కీలకమైన వికెట్లు తీసి బంగ్లాదేశ్ ను దెబ్బకొట్టాడు.
ఓపెనర్ షాద్మాన్ ఇస్లాం (35), మొమినుల్ హక్ (13), ముష్ఫికర్ రహీమ్ (13) వికెట్లు అశ్విన్ ఖాతాలో చేరాయి. బుమ్రాకు ఒక వికెట్ దక్కింది. 33 పరుగులు చేసిన ఓపెనర్ జకీర్ హుస్సేన్ ను బుమ్రా అవుట్ చేశాడు.
ఈ నేపథ్యంలో, చెన్నై టెస్టులో ఓటమి తప్పించుకోవడం బంగ్లాదేశ్ కు అయ్యే పని కాదు. ఆ జట్టు ఇంకా 357 పరుగులు వెనుకబడి ఉంది. ఆటకు మరో రెండ్రోజుల సమయం మిగిలున్నప్పటికీ, ఫామ్ లో ఉన్న టీమిండియా బౌలర్లను ఎదుర్కొని బంగ్లాదేశ్ బ్యాటర్లు క్రీజులో అంత సమయం పాటు నిలవడం కష్టసాధ్యం. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ బౌలింగ్ ఎంచుకున్న సంగతి తెలిసిందే. దాంతో మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో 376 పరుగులు చేసింది. అనంతరం, బంగ్లాదేశ్ ను 149 పరుగులకే కుప్పకూల్చి కీలకమైన 227 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. ఇక, రెండో ఇన్నింగ్స్ ను 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసిన టీమిండియా... బంగ్లాదేశ్ ముందు 515 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో రవిచంద్రన్ అశ్విన్ సెంచరీ చేయడం హైలైట్ గా నిలవగా... రెండో ఇన్నింగ్స్ లో శుభ్ మాన్ గిల్, రిషబ్ పంత్ సెంచరీలు బాదడం విశేషం.

# గిల్ దవడపై కొట్టిన రోహిత్.. డగౌట్‌లో నవ్వులే నవ్వులు

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఎంత ప్రశాంతంగా ఉంటాడో అంతే ఫన్నీగా ఉంటాడు. తాజాగా అతను డగౌట్ వద్ద సరదాగా చేసిన ఒక సంఘటన నవ్వు తెప్పిస్తోంది. చెన్నై టెస్ట్ రెండో రోజు ఆటలో భాగంగా టీమిండియా తొలి సెషన్ లో బ్యాటింగ్ చేస్తుంది. ఈ సమయంలో రోహిత్ శర్మ శుభ్‌మన్ గిల్‌తో సరదాగా గడిపాడు. ఈ క్రమంలో ఏదో చెబుతున్నట్టు చేయి చూపిస్తూ గిల్ దవడపై కొట్టాడు. దీంతో గిల్ చిన్నపిల్లాడిలా ఏడవడం ప్రారంభించాడు. ఈ సీన్ చూసిన కోహ్లీ వారిద్దరి వైపు కెమెరా ఉందనే సంగతి గుర్తు చేశాడు. దీంతో రోహిత్ తో పాటు కోహ్లీ, గిల్, గంభీర్ నవ్వుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతుంది. ఎంతో సరదాగా సాగిన ఈ సంఘటన ముచ్చట గొలిపేలా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో కోహ్లీ, రోహిత్, గిల్ విఫలమయ్యారు. కోహ్లీ, రోహిత్ 6 పరుగులు చేయగా.. గిల్ డకౌటయ్యాడు. రెండో ఇన్నింగ్స్ లో రోహిత్ 5 పరుగులకు కోహ్లీ 17 పరుగులకు పెవిలియన్ చేరగా.. గిల్ మాత్రం 119 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే భారత్ విజయం దిశగా దూసుకెళ్తుంది. 515 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. వెలుతురు లేని కారణంగా అరగంట ముందుగానే ఆటను నిలిపివేశారు. ప్రస్తుతం క్రీజ్ లో కెప్టెన్ శాంటో (51).. షకీబ్ (5) ఉన్నారు. భారత్ మరో 6 వికెట్లు తీస్తే గెలుస్తుంది. మరోవైపు బంగ్లాదేశ్ విజయం సాధించాలంటే 357 పరుగులు చేయాల్సి ఉంది.



# టీమిండియా నుంచి రాజస్థాన్‌కు: రాయల్స్ జట్టులో విక్రమ్ రాథోర్



ఐపీఎల్ 2025 లో టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరాడు. 2025 ఐపీఎల్ కు రాజస్థాన్ రాయల్స్ తమ బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ ఓపెనర్ విక్రమ్ రాథోర్‌ను నియమిస్తున్నట్లు శుక్రవారం (సెప్టెంబర్ 20) ప్రకటించింది. "రాథోర్ అనుభవజ్ఞుడైన ప్రొఫెషనల్ క్రికెటర్. రాహుల్ ద్రవిడ్‌ను తిరిగి ప్రధాన కోచ్‌గా వచ్చిన కొన్ని రోజులకే రాయల్స్ కోచింగ్ సెటప్‌లో చేరాడు" అని రాజస్థాన్ రాయల్స్ ఒక ప్రకటనలో తెలిపింది.
ద్రవిడ్ ప్రధాన కోచ్ గా విక్రమ్ రాథోర్ బ్యాటింగ్ కోచ్ గా టీమిండియాకు పని చేసి ఇటీవలే రాజీనామా చేశారు. మళ్ళీ ఆ ఇద్దరే అదే పాత్రల్లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరడం విశేషం. వీరిద్దరి హయాంలో భారత్ టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న సంగతి తెలిసిందే. రాథోర్ భారత్ తరపున ఆరు టెస్టులు.. ఏడు వన్డేలాడాడు. 33 ఫస్ట్ క్లాస్ సెంచరీలు అతని ఖాతాలో ఉన్నాయి. రాథోర్ 2019 నుండి 2023 వరకు టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా ఉన్నాడు. రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ లాంటి ఆటగాళ్ల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాడు.
విక్రమ్ రాథోర్ బ్యాటింగ్ కోచ్ గా నియమించడంపై ద్రవిడ్ స్పందించాడు. "చాలా సంవత్సరాలుగా విక్రమ్‌తో సన్నిహితంగా పని చేశాను. అతని సాంకేతిక నైపుణ్యం, ప్రశాంతమైన ప్రవర్తన, లోతైన అవగాహన రాయల్స్‌కు సరిగ్గా సరిపోతాయని నేను నమ్మకంగా చెప్పగలను" అని ద్రవిడ్ అన్నాడు. 2023 ఐపీఎల్ రన్నరప్ గా నిలిచినా రాజస్థాన్ రాయల్స్ ఈ ఏడాది క్వాలిఫయర్ 2 మ్యాచ్ లో ఓడిపోయింది.

# అందరూ దసరాకే పెట్టారా? ముహూర్తం!

మాళవిక మోహనన్ శైలి మిమ్మల్ని విస్మయానికి గురి చేస్తుంది





నలుపు రంగులో ఉన్న సమంత హృదయాలను చంపేసింది



స్టార్ హీరోలంతా ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున, విజయ్ దేవరకొండ ఇలా సీనియర్ హీరోల నుంచి జూనియర్ హీరోల వరకూ సెట్స్ లో ఉన్నారు. కానీ ఇందులో చిరంజీవి మినహా హీరోలు ఇంకా తమ టైటిల్స్ ప్రకటించలేదు. చిరంజీవి చిత్రానికి 'విశ్వభర' గా టైటిల్ ఖరారు చేసిన సంగతి తెలిసిందే. సంక్రాంతి కానుకగా రిలీజ్ అవుతున్న సినిమా అప్ డేట్స్ ఇంకా రావాల్సి ఉంది. ఇక నటసింహ బాలకృష్ణ 109వ సినిమా టైటిల్ ఏదై ఉంటుందని? అభిమనుల్లో ఒకటే ఉత్కంఠ కొనసాగుతుంది. బాబి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాకి ఎలాంటి టైటిల్ ఫిక్స్ చేసారని గెస్ చేస్తున్నారు. సాధారణంగా బాలయ్య టైటిల్స్ చాలా పవర్ ఫుల్ గా ఉంటాయి. బాబి కూడా పవర్ ఫుల్ టైటిల్ నే తీసుకుంటారు. ఈ నేపథ్యంటో టైటిల్ పై ఆసక్తి కొనసాగుతోంది. విక్టరీ వెంకటేష్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతుంది.
'సంక్రాంతి వస్తున్నాం' అనే వర్కింగ్ టైటిల్ తో సెట్స్ కి వెళ్లిన అనీల్ ఇంకా టైటిల్ ప్రకటించలేదు. కూల్ గా పనిచేస్తున్నాడు. మరోవైపు విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి ఓ సినిమా తెరకెక్కి స్తున్నారు. ఇప్పటికే రిలీజ్ తేదీ కూడా ఖరారు చేసుకుంది. కానీ టైటిల్ ఇంకా అనౌన్స్ కాలేదు. విజయ్ వరుస పరాజయాల నేపథ్యంలో చేస్తోన్న సినిమా కావడంతో టైటిల్ పై ఆసక్తి నెలకొంది. ఇక కింగ్ నాగార్జున సోలో ప్రాజెక్ట్ ల గురించి ప్రకటించాల్సి ఉంది. వరుసగా ఆయన ఇద్దరు దర్శకుల్ని లైన్ లో పెట్టారు. ఆ చిత్రాలు పట్టాలెక్కించే పనిలో ఉన్నారు. అయితే ఈ సినిమా టైటిల్స్ అన్ని ఒకేసారి రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దసరా సందర్భంగా అక్టోబర్ లో రిలీజ్ చేయాలని నిర్మాణ సంస్థలు భావిస్తున్నాయట. సాధారణంగా దసరా అంటే కొత్త సినిమాల ప్రారంభోత్సవాలకు మంచి శుభ సూచికం. రిలీజ్ లు కూడా అలాగే ఉంటాయి. ఈనేపథ్యంలో నయా స్టార్లు అంతా ఆ రోజు టైటిల్స్ తో వచ్చే అవకాశం ఉందంటున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com